క్లుప్తంగా

వర్షానికి రోడ్లు జలమయం



శృంగవృక్షంలో జలమయమైన శివాలయం రహదారి

పాలకోడేరు: శృంగవృక్షంలో సోమవారం కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు లాగక రోడ్లపైనే నిలిచిపోయింది. ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో అడుగుమేర వర్షపు నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో పూడిపోయిన ప్రధాన డ్రెయిన్లు, అంతర్గత డ్రెయిన్లలో పూడిక తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్లు

కాళ్ల: ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించి రేకుల షెడ్లు వేశారంటూ పెదఅమిరం గ్రామానికి చెందిన కోన పురుషోత్తమవర్మ సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సరస్వతీ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో ఇటీవల ఒకరు రేకుల షెడ్లు వేశారన్నారు. దీంతోపాటు గత రెండు రోజుల క్రితం మరొక రేకుల షెడ్డు వేసి ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని పంచాయతీ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

భాషా నైపుణ్యం పెంపొందించుకోవాలి



భాషా నైపుణ్యం కార్యక్రమంలో విద్యార్థులు

ఆకివీడు: విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే భాషలో ప్రావీణ్యత సాధించి, నైపుణ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఆర్వీ నారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని అజ్జమూరు గురువులోని ఎంపీపీ పాఠశాలలో భారతీయ భాషోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పద్యాలు, గేయాలు, మాట్లాడటం భాషోచ్చరణ వంటివాటిపై తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు బహుభాషా నైపుణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా ఒక్కటే భాషా భేదం లేకుండా ఐక్యమత్యంతో మెలగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. భరత మాత, సైనికుడి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

కనకదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.65 లక్షలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా, రూ.2,65,096 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్ చెప్పారు. సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం డివిజన్ అధికారి వర్దినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీలు లెక్కించగా, మూడు నెలలకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ట్రస్టీలు రేలంగి నరసింహమూర్తి, దాసరి దివ్యశ్రీ, గుండుబోయిన అరుణకుమారి, మాజేటి మంగాకుమారి, తాతపూడి శ్రీరాములు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

నరసాపురం రూరల్: మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను ఎంపీడీవో బాబ్జిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 సంవత్సరాల మధ్యకాలంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన 1254 పనులకు సంబంధించి రూ.4.69 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన రూ.2.74 కోట్ల విలువైన 47 పనులకు సంబంధించి గత వారం రోజుల నుంచి ఆయా గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి గుర్తించిన అవకతవకలపై కూడా చర్చించారు. తనిఖీలో అధికంగా వాడిన రూ.3,164 రికవరీ చేసి అందుకు జరిమానాగా రూ.6 వేలు విధించారు. డీపీవో విజయలక్ష్మి, ఏపీడీ సాగర్, డీపీఎం మురళీకృష్ణ, ఎంపీడీవో బాబ్జిరాజు, ఎస్ఆర్పీ మన్మథరావు, పీఆర్ జేఈ సీహెచ్ అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభివృద్ధి

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఆకివీడులో సేవా కార్యక్రమాలు



ఆకివీడు వైఎస్సార్ సెంటర్‌లో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా చూసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన దేశానికే స్ఫూర్తిగా నిలిచిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు నిండిన సందర్భంగా ఆకివీడులోని వైఎస్సార్ సెంటర్‌లో సోమవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి పీవీఎల్, నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పీవీఎల్ మాట్లాడుతూ పాదయాత్ర స్ఫూర్తితో రూపొందించిన మ్యానిఫెస్టోలోని 95 శాతం అంశాల్ని అధికారంలోకి వచ్చిన తరువాత అమలుజేశారన్నారు. నవరత్నాలు కంటే అదనంగానే పథకాల్ని అమలు జేశారని చెప్పారు. ఆయా పథకాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. కొన్ని రాష్ట్రాలలో అమలుజేయడానికి ముందుకువచ్చారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన కొన్ని పథకాల్ని మెచ్చుకుని దేశ వ్యాప్తంగా అమలుజేసేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ప్రతి పథకంతో పేదవాడి ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. ప్రతి పథకం ద్వారా వచ్చే సొమ్మును మహిళల బ్యాంక్ ఖాతాకే నేరుగా సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి జమచేస్తున్నారని చెప్పారు. పథకాల్ని పారదర్శకంగా అందజేస్తూ అవినీతికి తావులేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వ పథకాలతో పేదలు లక్షాధికారులయ్యారన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలు సహాయం అందజేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అందజేయని విధంగా సీఎం వైఎస్ జగన్ చేస్తున్న పరిపాలనకు ప్రజలు మద్దతు తెలిపి, మళ్లీ జగన్ ప్రభుత్వం వచ్చేలా కృషి చేయాలన్నారు. మీ కోసం మేలు చేసే జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పరిపాలనలో అత్యవసరమైన 108 వాహనం కూత ఎక్కడైనా విన్పించిందా అని పీవీఎల్ ప్రశ్నించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందకుండా ఆరోగ్యశ్రీని అణగదొక్కారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అడ్రస్సు లేకుండా చేశారని చెప్పారు. ఇటువంటి పరిపాలన కావాలా, మీ ఇంటి వద్దకు వైద్యం అందించే ప్రభుత్వం కావాలో మీ చేతుల్లోనే ఉందని పీవీఎల్ అన్నారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో పీవీఎల్ చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు గుండా సుందరరామనాయుడు అధ్యక్షత వహించగా, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, టిడ్కోటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర డైరెక్టర్ పళ్లెం అరుణకుమారి, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పుప్పాలపండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అన్యం కృష్ణ, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, మన్నే లలితాదేవి, గుండుగొలను సావిత్రి, ఎండీ జక్కీ, సాయిమ్మ, శిరపు శ్రీనివాస్, ఎస్కే హుస్సేన్, కఠారి రామకృష్ణ, ఎండీ జహంగీర్, చిక్కాల చిన్నా, కేశిరెడ్డి దిలీప్, కుర్రెళ్ల పోలు, జోగి నాగరాజు, ఎండీ.ఆలీ, మాబూ, కత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

కాళ్ల: తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు సోమవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కలవపూడి గ్రామానికి చెందిన చిన్నం బేబీ బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లింది. భర్త రాజశేఖర్ ఇంటి వద్దనే ఉంటూ తన ఇద్దరు పిల్లల్ని చూసుకుంటున్నాడు. ఈ నెల 2వ తేదీన రాత్రి సుమారు 10 గంటల సమయంలో రాజశేఖర్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయినట్లు భార్య బేబీకి సమాచారం అందింది. దీంతో గల్ఫ్ నుంచి వచ్చిన భార్య ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రేపు యూపీఏ సమావేశం

ఉండి: అర్తమూరులోని పాస్టర్ వైజే ప్రసాద్ హోలీ గాడ్ మినిస్ట్రీస్ చర్చిలో యూపీఏ మండల సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈలి డేవిడ్‌మార్క్ సోమవారం తెలిపారు. మండలంలోని సభ్యులంతా విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని పీపీ రోడ్డులో జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ అడబాల శ్రీను సోమవారం చెప్పారు. నిందితుల నుంచి రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మహిళల అభివృద్ధే సీఎం జగన్ ఆశయం



స్లమ్ సమాఖ్యల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్

ఆకివీడు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. నగర పంచాయతీ ఆవరణలో గొడవీధి, పెదపేట స్లమ్ సమాఖ్యల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ రుణమాఫీ చేస్తానని ఐదేళ్లు ఊరించిన చంద్రబాబు ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరుతో రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్న సంఘటనల్ని మహిళలు మరచిపోతారా అని ప్రశ్నించారు. వేలల్లో మాత్రమే డ్వాక్రా రుణాలిచ్చి వందల్లో వడ్డీలు కాజేసిన చంద్రబాబు పరిపాలన గుర్తుందా అని ప్రశ్నించారు. పేదలకు గత 30 ఏళ్లలో ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. పూరి గుడెసలు, రోడ్లు, మురుగు కాల్వల వెంబడి జీవనం గడిపిన రోజుల్ని మరిచిపోవద్దన్నారు. ఆ దుస్థితి నుంచి పేదల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక పథకాల్ని అమలు జేశారన్నారు. ఆనాటి ప్రభుత్వానికి నేటి జగన్ ప్రభుత్వానికి తేడాను మహిళలు గుర్తించాలని కోరారు. మేలు చేసే వారికే ధైర్యంగా ఓటు వేయాలని సీఎం వైఎస్ జగన్ చెప్పిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబంలో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా లబ్ధి పొందారన్నారు. ప్రతి పథకం క్యాలెండర్ పద్ధతిలో అమలు జేసి మీ ఖాతాల్లో సొమ్ము వేస్తున్నారన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రతి మహిళా ఉన్నత స్థితిలో ఉండాలని చూస్తున్నది సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని పీవీఎల్ అన్నారు. డ్వాక్రా మహిళా గ్రూపులు చిరు బ్యాంకులుగా రాష్ట్రంలో మారాయని పీవీఎల్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో కంటే అధికంగా రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ సున్నా వడ్డీకి రుణాలు అందజేస్తోందన్నారు. ఇంతటి గొప్ప పరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ఆదరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమానికి మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి అధ్యక్షత వహించగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి, గాలి సామ్రాజ్యం, మన్నే లలితాదేవి పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై సీపీఎం నిరసన

ఉండి: భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకు భంగం కలిగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో యండగండిలో సోమవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తే వారిపై తప్పుడు కేసులు మోపడం సరికాదన్నారు. ఢిల్లీలో రైతులు చేపట్టిన నిరసనను ప్రపంచానికి తెలియపరచిన మీడియా ప్రతినిధులపై కేసు పెట్టి వారిని ఇరికించడం దారుణమన్నారు. భావప్రకటన స్వేచ్ఛను కేంద్రం తుంగలో తొక్కిందన్నారు. ఢిల్లీ మీడియా ప్రతినిధులపై పెట్టిన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీల ప్రతులను తగులబెట్టారు. పార్టీ మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, కిలారి తవిటినాయుడు పాల్గొన్నారు.

'సంకల్ప'ంతోనే సంక్షేమ పథకాల అమలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేయడానికి ప్రజాసంకల్ప యాత్ర ప్రధాన కారణమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసుకుని ఆరేళ్లు పూర్తి అయిన సందర్భంగా సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నందున నవరత్న పథకాల ద్వారా అందరికీ చేయూతను ఇస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నాలుగున్నర ఏళ్లలో 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. హామీలు నెరవేర్చడం ద్వారా ప్రజల్లో రాజకీయ నాయకుల పట్ల విశ్వసనీయత తిరిగి కల్పించగలిగారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత కరోనా వైరస్ కారణంగా రెండేళ్లు రాష్ట్ర ఆదాయాన్ని పూర్తిగా దెబ్బతీసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం పటిష్టంగా అమలు చేశారని శ్రీనివాస్ గుర్తు చేశారు. మహానేత వైఎస్సార్ పాలన స్వర్ణయుగమైతే దాన్ని మించేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మరింత అండగా ఉండాలని శ్రీనివాస్ కోరారు.

100 పడకల ఆసుపత్రికి రూ.28 కోట్లు మంజూరు

పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రికి ప్రభుత్వం నాబార్డు నుంచి మరో రూ.28 కోట్లు మంజూరు చేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. దీనికి ముందు ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.10.15 కోట్లు నిధులు మంజూరు కాగా, ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ నగర బాట పర్యటనకు భీమవరం వచ్చిన సందర్భంగా అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న తాను 100 పడకల ఆసుపత్రి ఆవశ్యకతను వివరించానన్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆసుపత్రి ఆవశ్యకతను ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని దృష్టిలో పెట్టడంతో ఆసుపత్రి మంజూరైందన్నారు. భీమవరంలో 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన తెలిపారు. అదనపు నిధులు మంజూరు చేసినందుకు శ్రీనివాస్ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాణసంచా విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురాజు

ఆకివీడు: బాణసంచా విక్రయాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు చెప్పారు. స్థానిక సీఎం హైస్కూల్ ఆవరణలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఆర్డీఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలను కచ్చితంగా అమలుజేయాలన్నారు. ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 120 మంది తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, 15 మంది పర్మినెంట్ లైసెన్సు దారులున్నారని చెప్పారు. ఆయా పర్మినెంట్ లైసెన్సు హోల్డర్ల షాపులు, గొడౌన్‌లను పరిశీలించినట్లు, తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏర్పాటు చేయబోయే దుకాణాల ప్రాంతాల్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆయా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించే విధంగా మండల రెవెన్యూ అధికారులకు తగిన సూచనలిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్వీ విజయలక్ష్మి, ఆర్.సూర్యనారాయణ, రిటైల్ వర్తకుల సంఘ ప్రతినిధి అందే రాజబాబు పాల్గొన్నారు.

నేడు ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: ఉండి నాలుగో నంబర్ గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే అంజనేయరాజు సోమవారం చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ శివారు నక్కరాజుగుంట చర్చి వద్ద నుంచి ప్రారంభించే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

పాస్‌పోర్టు పోయినది

దంపనపు శ్రీనివాస్, తండ్రి: చంద్రశ్వ, డోర్ నెం.25-9-176/14ఎ, గాంధీనగర్, గొల్లవానితిప్ప రోడ్, భీమవరం పట్టణం, భీమవరం మండలం, ప.గో.జిల్లా. అనునేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను ఒరిజినల్ పాస్‌పోర్టు (నెం.X253183 గలది) కలిగి ఉన్నాను. ది.01.11.2023 తేదీన సదరు పాస్‌పోర్టును తీసుకొని భీమవరం పట్టణం, [illegible] సెంటర్‌లో [illegible] నా పాస్‌పోర్టు పోగొట్టుకున్నాను. [illegible]

పుష్కరిణిగానే కొఠాలపర్రు చెరువు

పెనుగొండ: కొఠాలపర్రులో ఇటీవల అభివృద్ధి చేసిన చెరువును కేశవస్వామి పుష్కరిణిగానే ఉంచాలని కొఠాలపర్రు గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు సోమవారం తూర్పుపాలెంలో కలిసి విజ్ఞప్తి చేశారు. రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కేశవస్వామికి పూర్వకాలం నుంచి ఇదే చెరువు నుంచి తీర్థపు బిందెను తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. ప్రజల కోరిక మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పుష్కరిణిగానే అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, జిల్లా కార్యదర్శి కాకిలేటి బాపిరాజు, దివి గణపతి పాల్గొన్నారు.

ఘనంగా బేతాళ ఉత్సవం



వీరవాసరంలో గజ వాహనంపై ఊరేగుతున్న బేతాళుడు



బేతాళ ఉత్సవంలో విచిత్ర వేషధారణల్లో కళాకారుల ప్రదర్శనలు

వీరవాసరం: వీరవాసరం గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 151వ ఏనుగు సంబరం బేతాళ ఉత్సవం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో, బాణసంచా కాల్పులు మధ్య బేతాళుని గజావాహనంపై ఉంచి ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, టీన్మార్ నృత్యాలు, కోలాట ప్రదర్శన, మ్యూజికల్ బ్యాండ్ మేళాలతో బేతాళ ఉత్సవాలు అత్యంత వేడుకగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భీమవరం రూరల్ సీఐ వై.సత్య కిషోర్, ఎస్సై పి.రమేష్, ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రహదారులే డంపింగ్ యార్డులు

- పాలకోడేరు మండలంలోని గ్రామాల్లో దుస్థితి
- గ్రామాల్లో మెరుగుపడని పారిశుధ్య నిర్వహణ



శృంగవృక్షంలో రహదారిలో వేసిన చెత్తకుప్పలు

పాలకోడేరు: మండలంలోని అనేక ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులుగా తలపిస్తున్నాయి. ఇష్టానుసారంగా రోడ్ల మార్జిన్లు చెత్తకుప్పలతో నిండిపోయాయి. మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించడంపై ఇటీవల స్వాక్షాత్తు కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక ఓ పంచాయతీ కార్యదర్శిని, ఎంపీడీఓను ప్రభుత్వానికి సరెండర్ చేసినా కింది స్థాయి అధికారుల్లో మార్పు కనిపించకపోవడం, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడకపోవడం గమనార్హం. పరిసరాల పరిశుభ్రత కోసం గ్రామాల్లో ఎక్కడా చెత్తకుప్పల కనపడకూడదని, ఎక్కడికక్కడ డంపింగ్ యార్డులను భారీ ఖర్చుతో నిర్మించారు. ఈ డంపింగ్ యార్డ్‌లను స్థానిక పంచాయతీ అధికారులు నిరుపయోగంగా వదిలేయడంతో గ్రామాల్లో వెలువడుతున్న వ్యర్థాలు చెత్తకుప్పలను రహదారుల అంచులలో వేసి తగలబెడుతున్నారు. క్షేత్రస్థాయిలో చెత్తకుప్పలను సంపద కేంద్రాలు తరలించకుండా కాలువలు పక్కన, రహదారులు పక్కన వేస్తూ కాలుష్యానికి ప్రధాన కారకులుగా మారుతున్నారు. ఉండి కాలవ వెంబడి గరగపర్రు, గొల్లలకోడేరు ప్రాంతాల్లో వేస్తున్న చెత్త కుప్పలతో తాగునీరు కలుషితంగా మారుతోంది. ఈ వ్యర్థాల కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్యాలపాలవుతున్నారు. పాలకోడేరు, మోగల్లు, పెన్నాడ, శృంగవృక్షం, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో రహదారుల వెంబడి చెత్తకుప్పలకు తరచూ నిప్పు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తుప్పుపట్టిపోతున్న చెత్త తరలించే రిక్షాలు

మండలంలో పదుల సంఖ్యలో కొత్త చెత్త రిక్షాలు, విద్యుత్తుతో నడిచే రిక్షాలు ఉన్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఈ రిక్షాలు ఆయా పంచాయతీ కార్యాలయాల సమీపంలోని ఉపయోగించకుండానే తుప్పు పట్టి పాడైపోతున్నాయి. చెత్తరిక్షాలను, డంపింగ్ యార్డ్‌లను ఉపయోగంలోకి తీసుకువస్తే, సమస్యకు కొంత పరిష్కారం లభించే అవకాశం ఉన్నా అధికారులకు పట్టడం లేదు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో చెత్త, వ్యర్థాలను రహదారులు, కాలువలు పక్కన వేయకుండా డంపింగ్ యార్డులకు తరలించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.
– కె.నాగేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో